సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలోని శ్రీసుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కాల సర్ప దోష నివారణ పూజను చేశారు. ఈ పూజ వల్ల కాల సర్ప దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ పూజలో ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, ఈవో పి.లక్ష్మారెడ్డి, అర్చకులు కాశీనాథశర్మ, జగన్‌మోహనచార్యులు, గోపాలాచారి, భవనందశర్మ, నరసింహమూర్తి, రామాచారి, కమిటీ సభ్యులు, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ముషీరాబాద్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ముషీరాబాద్‌కు చెందిన ఆలిండియా ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు మంగళవారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ముషీరాబాద్‌లో చేపడుతున్న పార్టీ కార్యక్రమాల వివరాలు, ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పోస్టులు లభిస్తాయని తెలిపారు.

డాక్టర్ కె.లక్ష్మణ్‌కు సన్మానం



బీజేపీ కార్యాలయంలో డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న సాయికృష్ణ, శేషసాయి

ముషీరాబాద్: ఏసియా ఫసిఫిక్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొని నగరానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ నాయకులు సాయికృష్ణయాదవ్, రొయ్యూరు శేషసాయి మంగళవారం నగర పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఫిజీ దేశంలో జరిగిన అత్యున్నత సమావేశంతో సిడ్నీలో జరిగిన ఎన్ఆర్ఐ సమావేశంలో భారత ప్రతినిధిగా పాల్గొని ప్రసంగించారని అన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు నిరుద్యోగులకు రూ.4వేల భృతి చెల్లిస్తామని చెప్పి కాలయాపన చేస్తోందని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ ప్రదీప్, వి.అజయ్ విమర్శించారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వకపోతే ప్రశ్నించిన కాంగ్రెస్ నేడు వారి దారిలోనే వెళ్తోందన్నారు. ఉద్యోగ కేలండర్ ప్రకటించినా, ఉద్యోగాలు మాత్రం భర్తీ చేయడం లేదన్నారు. కనీసం నిరుద్యోగ భృతి కూడా అమలు చేయడం లేదన్నారు. ఇకటినైనా ప్రభుత్వం మేల్కొని జూన్ 2 నాటికి నిరుద్యోగ భృతిపై క్లారిటీ ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వమే కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్టడీ మెటీరియల్ ప్రభుత్వమే అందించాలన్నారు. లైబ్రరీలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్, ఎం.రవికుమార్, సహాయ కార్యదర్శులు ప్రతాప్, ఎన్‌పీ రాకేష్, సభ్యులు భరత్, బీఎస్ కృష్ణ, దేవ, నవీన్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

ఆటో దొంగ రిమాండ్

చాదర్‌ఘాట్: పాత నేరస్తుడు ఆటో దొంగను చాదర్‌ఘాట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మిధానిలో నివసించే పాత నేరస్తుడు నేనావత్ రవీందర్ (31) ఈనెల 24న పల్టన్‌లో ఒక ఆటోను తొంగిలించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీఉసలు మంగళవారం రవీందర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

టైమర్ ఫికర్.. సెట్ చేస్తే బెటర్.!

- ట్రాఫిక్ సిగ్నళ్ల టైమర్లతో వృథా అవుతున్న సమయం
- చిన్న కూడళ్లలో ఎక్కువ సమయం సెట్టింగ్‌తో అవస్థలు
- 30 సెకన్ల ఉండాల్సిన చౌరస్తాలో 120 సెకన్లు ఉంటున్న వైనం

అంబర్‌పేట: వాహనదారులు తీవ్ర నిరీక్షణకు గురవుతున్నారు. చిన్న చిన్న కూడళ్ల వద్ద గ్రీన్ సిగ్నల్ కోసం పడికాపులు పడుతున్నారు. అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్లు సూచించే టైమర్లతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చిన్న కూడలి వద్ద సైతం 120 సెకన్ల సమయం ఉండడంతో చౌరస్తా ఖాళీగా మారుతుంది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి చౌరస్తా ఖాళీగా దర్శనమిస్తుంది. ట్రాఫిక్ స్నిగళ్లలో అవసరానికి మించి టైమర్లు ఉండడంతో వాహనదారులు చౌరస్తాల్లో అసహనానికి గురవుతున్నారు. తిలక్‌నగర్ చౌరస్తా, అలీకేఫ్ చౌరస్తా, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, ఓయూ చౌరస్తా, నింబోలిఅడ్డా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్ల టైమర్లు అవసరానికి మించిన సమయాన్ని సూచిస్తున్నాయి. దీంతో వాహనదారలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన ఆయా ట్రాఫిక్ సిగ్నళ్ల సమయాన్ని చౌరస్తాలకు అనుగుణంగా టైమర్లను ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



తిలక్‌నగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్

60 సెకన్లలో క్లియర్ అయ్యే ట్రాఫిక్‌కు 120 సెకన్లు...

◆ కొన్ని చౌరస్తాల్లో 30 నుంచి 60 సెకన్లలతో ట్రాఫిక్ క్లియర్ అవుతుంది. నాలుగు వైపుల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను నిలపడానికి కొన్ని చౌరస్తాల్లో కొంత సమయం సరిపోతుంది. ఎక్కువ టైమర్ ఉండడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో ఆయా చౌరస్తాల్లో ట్రాఫిక్ సమస్య సైతం వచ్చి పడుతుంది. రెండేసి నిమిషాలు రెడ్ సిగ్నల్ ఉండడంతో నాలుగు రోడ్లపై ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

◆ ఉదయం, సాయంత్రం కొంత మేర రద్దీ ఉన్నప్పటికి ఇతర సమయాల్లో మాత్రం ఎలాంటి ట్రాఫిక్ లేకుండా సిగ్నల్ వద్ద రెండు నిమిషాలు వాహనదారులు వేచి ఉండడంపై ఇబ్బందులు పడుతున్నారు. వారి సమయం కూడ వృథా అవుతోంది. ఇప్పటికైన ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో పలు సిగ్నళ్లపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అధ్యాయనం చేసి టైమర్లను సెట్ చేయాలని పవ్వురు కోరుతున్నారు.

పరిశీలిస్తాం..

ట్రాఫిక్ సిగ్నళ్ల టైమర్లపై ప్రత్యేక విజిట్ చేస్తాను. అవసరమైన ప్రాంతాల్లో చేర్పులు మార్పులు చేపట్టేందుక ఐటీ సెల్ విభాగం దృష్టికి తీసుకువెళ్లి మార్చేందుకు చర్యలు తీసుకుంటాను. ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులు పడకుండా కృషి చేస్తాను.

– సంపత్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ

యువత రాజకీయాల్లోకి రావాలి

కాచిగూడ: ప్రస్తుత పరిస్థితుల్లో నేటి యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని గడ్డం పొలిటికల్ అకాడమీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం బర్కత్‌పురలో నూతనంగా ఏర్పాటు చేసిన గడ్డం పొలిటికల్ అకాడమీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. రాజకీయాల పట్ల అవగాహన కల్పిస్తూ, రాజకీయాల్లోకి రావాలనే ఉత్సాహవంతులైన యువతకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రామస్థాయి నుంచి యువత రాజకీయాల్లోకి వచ్చే విధంగా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చని తెలిపారు. త్వరలో గ్రామ, మండల స్థాయిలో జరగనున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, జీహెచ్ఎంసీ పరిధిలో జరగనున్న కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే విధంగా శిక్షణ ఇస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రశాంత్‌కిషోర్, సునీల్ కనుగోలు, పాడే, ప్రొ. నాగేశ్వర్‌రావు లాంటి వారితో తరగతులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములుయాదవ్, బేరి రాంచందర్, సాయన్న ముదిరాజ్, మహేష్‌గౌడ్, సత్యనారాయణ, బొడిగే శ్రీనివాస్, కె.వీరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలో మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు



శ్యామ్‌నగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం జీహెచ్ఎంసీ, జలమండలి, ఆయా ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం గోల్నాక డివిజన్ శ్యామ్‌నగర్, సుందర్‌నగర్ బస్తీల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీల్లో ప్రస్తుత జనాభాకు అనుగుణంగా సీసీరోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, మంచినీటి పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. నిత్యం రద్దీగా ఉంటే రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ నగరంలో నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఇలాంటి హాస్టళ్లపై నిరంతరం నిఘా పెట్టి తనిఖీలు చేయాలన్నారు. మంగళవారం డీవైఎఫ్ఐ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. ధనార్జనే ధ్యేయంగా కనీస సౌకర్యాలు కల్పించకుండా హాస్టళ్లను నిర్వహిస్తున్నారని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారే తప్ప సరైన వసతులు కల్పించడంలేదని ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తామే హాస్టళ్లలో తనిఖీలు చేపట్టి ప్రభుత్వం ముందు పెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు దామెర్ల హస్మిబాబు, నగర కార్యదర్శి ఎండీ జావెద్, నాయకులు రాజు, దేవేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

అంబేడ్కర్ కళాశాలకు అటానమస్ హోదా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలకు యూజీసీ నుంచి అటానమస్ హోదా లభించింది. మంగళవారం కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ ప్రాంగణంలో టపాకాయలు పేల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు ఈ స్వయం ప్రతిపత్తి గుర్తింపు వచ్చిందన్నారు. అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. 1973లో అంబేడ్కర్ సూచన మేరకు కాకా అంబేడ్కర్ విద్యాసంస్థలను స్థాపించారని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ పేద విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. కళాశాల కార్యదర్శి ఎమ్మెల్యే జి.వినోద్ కుమార్ మాట్లాడుతూ.. 52 ఏళ్ల తర్వాత ఈ గుర్తింపు రావడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.సరోజ వివేక్, ఎంపీ జి.వంశీకృష్ణ, సీఈఓ ప్రొ. లింబాద్రి, కళాశాల ప్రిన్సిపాల్ డా. మట్టాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నేడు సునిల్ సంస్మరణ సభ

నల్లకుంట: గుండెపోటుతో ఈనెల 18న మృతి చెందిన తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రాష్ట్ర కోశాధికారి మంత్రి సునిల్ సంస్మరణ సభ ఈనెల 28న నిర్వహించనున్నట్లు టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నాగోల్-బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ సహభావన టౌన్‌షిప్ బ్లాక్ 05 ఫ్లాట్ నం.ఏ-104లో మధ్యాహ్నం ప్రారంభమవుతుందని అన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెండిగ్ పనులు పూర్తి చేయాలని ఓల్డ్‌మలక్‌పేట కార్పొరేటర్ మహ్మద్ షఫిఉద్దీన్ డిప్యూటీ కమిషనర్ జయంత్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో కొన్ని కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు మరమ్మతులను పూర్తి చేయాలని, అదేవిధంగా ముంపు ప్రాంతాల్లో నీరు నిలిచి కొంత మేర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు ప్రారంభించాలని కోరారు. శానిటేషన్ డ్రైనేజీల పనులపై దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా అందుకు డీసీ సానుకూలంటా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో వార్డ్ మెంబర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్‌వర్క్ పనుల పరిశీలన



చెప్పల్‌బజార్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లోని పీవీ ఏజెన్సీ నుంచి పన్నాలాల్ బిల్డింగ్ వరకు రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టారు. ఈ పనులను మంగళవారం కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి పరిశీలించారు. పనులు సక్రమంగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె జీహెచ్ఎంసీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, వాసు, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళాధర్‌నగర్‌లో...



కళాధర్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న పూస గోరక్‌నాథ్

ముషీరాబాద్: డివిజన్‌లోని గంగపుత్రకాలనీ కళాధర్‌నగర్‌లో అధ్వాన స్థితికి చేరుకున్న రోడ్లకు మంగళవారం ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టారు. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో బీఆర్ఎస్ నాయకుడు పూస గోరక్‌నాథ్ ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్యాచ్‌వర్క్ చేపట్టడంతో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు దూరమయ్యాయి.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- ప్రొఫెసర్ హరగోపాల్
- ఇప్పటికైనా మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ ప్రభుత్వం రోజురోజుకు విషపూరితంగా వ్యవహరిస్తూ రాజ్యాంగం, చట్టాలు, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. వెంటనే మావోయిస్టు పార్టీలతో చర్చలు జరిపి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మృతదేహాలను సామూహికంగా దహనం చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. చట్ట విరుద్ధమైన హత్యలపై సుప్రీం కోర్టు న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. ఆదివాసీ ప్రజలను అణచివేయడానికే ఆపరేషన్ కగార్‌ను చేపట్టారని ఆరోపించారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. అసలు దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ... గతంలో బూటకపు ఎన్‌కౌంటర్లు అయినా మృతదేహాలను ఇచ్చే వారని... నేడు అలా వ్యవహరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట సంఘీభావ వేదిక నాయకులు నారాయణరావు, హైకోర్టు న్యాయవాది రఘునాథ్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. లక్ష్మణ్

జనాభా లెక్కల షెడ్యూల్ విడుదల చేయాలి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం కులగణనను నిర్వహించాలని ప్రకటించినప్పటికీ దానిపై తదుపరి చర్యలు చేపట్టకపోవడం నిరాశపరిచిందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. కులగణనను తక్షణమే చేపట్టి, జనాభా లెక్కల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలోని అన్ని రాజకీయ పక్షాలను ఏకతాటిపైకి తెచ్చి, కులగణనను ప్రధాన అజెండాగా మార్చి కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా లెక్కల నిర్వహణకు స్పష్టమైన షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక అసమానత సాధించేందుకు అవసరమైన డేటా సేకరణ జరగాలన్నారు. ఇది వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రం నిర్లక్ష్య ధోరణిని వీడి పారదర్శకంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నేతలు, కులఘాల నేతలు, మేధావులు పాల్గొన్నారు.



పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: ఎంసీహెచ్‌కాలనీలో రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఎంసీహెచ్ కాలనీలో ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వెంటటే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.నవీన్‌గౌడ్, సత్యనారాయణ, కాలనీ ప్రతినిధులు అనంతకుమార్, తులసీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో చేపట్టిన నిరాహార దీక్షలో మాట్లాడుతున్న డా. చెరుకు సుధాకర్

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించి తగిన న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాటం చేసిన ఉద్యమకారులు, ప్రాణాలర్పించిన వారి కుటుంబాలను ఆదుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. కాని ఎన్నికల ముందు ఉద్యమకారులను ఆదుకుంటామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేబాటలో పయనిస్తోందని విమర్శించారు. ప్రతి జిల్లాలో అమరులైన ఉద్యమకారులకు స్మారక భవనం నిర్మించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలన్నారు. పట్టించుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'సూపర్ అవార్డ్స్-2025' పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగనున్న సూపర్ స్టార్ కృష్ణ 'సూపర్ అవార్డ్స్ -2025'పోస్టర్‌ను ఎఫ్‌టీపీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో సీఈఓ వెంకటేష్, జనరల్ మేనేజర్ ప్రజ్వల, మున్నూరు చందు, ప్రతిభతో కలిసి ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాలలో విశిష్ట కృషి చేసిన ప్రముఖులను గుర్తించి ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 31న సాయంత్రం 6గంటలకు ఎల్‌వీ ప్రసాద్ ల్యాబ్‌లో జరుగుతుందన్నారు. అలాగే 'సూపర్ ఉమెన్-2025'అవార్డుల కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఫ్‌టీపీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి

ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శం

చిక్కడపల్లి: వృత్తిపట్ల అంకిత భావం, క్రమశిక్షణతో ఉండే ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శమని ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. మంగళవారం శోభా ఇంటర్నేషనల్ అకాడమీ నిర్వహణలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ స్మారక పురస్కారంతో లలితకోద్ధారక బిరుదు ప్రదాన సభ జరిగింది. చిక్కడపల్లి త్యాగారాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజుకు బిరుదను ప్రదానం చేసి సత్కరించారు. వంశీ రామరాజు 50ఏళ్లకు పైగా వంశీ సంస్థల స్థాపించి అన్ని లలిత కళలను ప్రోత్సహించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సినీ జర్నలిస్ట్ ఎస్వీరామారావు, డా. తెన్నేటి సుధ, మధు జగన్నాథ్, శోభ రాజేంద్రప్రసాద్, శంకర్, శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వంశీ రామరాజు, దంపతులను సత్కరిస్తున్న రేలంగి నరసింహారావు